సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ❘ 22 ❘ అక్టోబర్ ❘ 2024



ముదురుతున్న వివాదం

డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో వ్యవసాయ శాఖకు, వ్యవసాయ విస్తరణాధికారులకు మధ్య వివాదం ముదురుతోంది. 8లో



దర్గాగా ప్రభుత్వ స్థలం కబ్జా

అశ్వారావుపేట మండలంలో ఓ గ్రామస్థాయి టీడీపీ నేత రూ.లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని దర్గాగా కబ్జా చేశాడు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన భాష్యం లక్ష్మీప్రసన్న దంపతులు రూ.లక్ష నగదును ఆలయ ఈఓ రమాదేవికి అందించారు.

15100 నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



స్టిక్కర్ ఆవిష్కరిస్తున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ జారీచేసిన హెల్ప్ లైన్ నంబర్ 15100పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. ఈ మేరకు రూపొందించిన స్టిక్కర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, బస్సులు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో స్టిక్కర్లను ప్రదర్శిస్తామని తెలిపారు. ఉచిత న్యాయ సలహాలు, సందేహాల నివృత్తికి ప్రజలు ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు పాల్గొన్నారు.

శిక్షణ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: భద్రాచలంలో ప్రభుత్వ గిరిజన ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ స్కూల్‌లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ కోర్సులో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో అన్ని గ్రూపుల వారు, 17 సంవత్సరాలు పైబడిన అవివాహిత, వితంతు, విడాకులు పొందిన గిరిజన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు డౌన్‌లోడ్ చేసుకోవాలని, రూ. 200 డీడీతో ట్రైనింగ్ స్కూల్‌లో 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలని తెలిపారు.

2,349 మంది బదిలీ వర్కర్లకు పదోన్నతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 2,349 మంది బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్లుగా పదోన్నతి కల్పించారు. సంస్థలో చేరిన వారిని తొలుత బదిలీ వర్కర్లుగా పరిగణిస్తారు. ఇందులో 190 మస్టర్లు చేసి న 2,349 మందికి జనరల్ మజ్దూర్లుగా పదోన్నతి కల్పిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి వీరిని పర్మనెంట్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. అత్యధికంగా శ్రీరాంపూర్ ఏరియాలో 662 మంది పదోన్నతి పొందగా, ఆర్జీ–1లో 552, భూపాలపల్లిలో 467 మంది, మందమర్రిలో 310మంది, ఆండ్రియాలలో 218 మందికి పదోన్నతి లభించింది. ఇక ఆర్జీ–2 ఏరియాలో 50మంది, కార్పొరేట్ ఏరియాలో 25 మంది, మణుగూరులో 19మంది, కొత్తగూడెంలో 16మంది, ఆర్జీ–3లో 12మందితో పాటు ఇల్లెందు, బెల్లంపల్లి ల్లో తొమ్మిది మందికి చొప్పున పదోన్నతి దక్కింది.

ఈఅండ్‌ఎం అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం) : సింగరేణిలో ఎనిమిది మంది ఈఅండ్‌ఎం అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఇద్దరు డీజీఎంలు, ఇద్దరు ఎస్‌ఈలు, నలుగురు డీవైఎస్‌ఈలు ఉన్నారు. నవంబర్ 1 లోపు వీరికి కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని పేర్కొన్నారు.

అద్దె యంత్రం.. ఆదాయం శూన్యం

పేరు, నిధులు మహిళా సమాఖ్యలవి

- నిర్వహణ సెర్ప్ అధికారుల చేతుల్లో..
- కార్యాలయం గడప దాటని యంత్రాలు
- రూ.లక్షల పెట్టుబడి నిరుపయోగం





ముసుగు వీడని మొక్కజొన్న నూర్పిడి యంత్రం (ఇన్‌సెట్) కార్యాలయంలో మూలుగుతున్న ట్రాక్టర్

ఇల్లెందురూరల్: మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలి. కానీ వారు సమావేశాలకు హాజరవడం.. ఫైళ్లపై సంతకాలు చేయడానికే పరిమితమయ్యే పరిస్థితిని సెర్ప్ అధికారులు కల్పిస్తున్నారు. దీంతో మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. భారీ వ్యయంతో కొనుగోలు చేసి.. నిరుపయోగంగా మూలుగుతున్న అద్దె యంత్రాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

రైతులకు మేలు చేసే లక్ష్యంతో..

రైతులకు వ్యవసాయం చేయాలనే ఆసక్తి ఉన్నా.. కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వ్యవసాయ పరికరాల రాయితీలను ప్రభుత్వం ఎత్తివేయడంతో పేద, మధ్యతరగతి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు తక్కువ ధరతో అద్దెకు అందించాలని సెర్ప్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. తదనుగుణంగా యంత్రాల కొనుగోలు, నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం గ్రాంట్ నుంచి పూర్తి సబ్సిడీతో 25 శాతం నిధులు, మండల సమాఖ్యలు 25 శాతం, 50 శాతం బ్యాంకు రుణంతో స్థానిక వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా మహిళా సమాఖ్య ప్రతినిధుల ఆధ్వర్యంలో యంత్రాలను కొనుగోలు చేయాలి. వారి పర్యవేక్షణలోనే అద్దె యంత్రాల కేంద్రం నిర్వహణ కొనసాగాలి.

కొనుగోలు చేసిన యంత్రాలివే..

జిల్లాలోని 22 మండలాల పరిధిలో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వ్యయంతో యంత్రాలు కొనుగోలు చేశారు. ఇందులో ట్రాక్టర్లు, రొటేవేటర్లు, కల్టివేటర్లు, ప్లవ్, మొక్కజొన్న నూర్పిడి యంత్రం, వరికోత యంత్రం, పవర్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రే, డ్రమ్ సీడర్లు, కలుపుతీసే యంత్రాలు, నీటిపైపులు, పామాయిల్ గెలలు కత్తిరించే యంత్రం అందుబాటులో ఉన్నాయి.

కార్యాలయాలకే పరిమితం..

ఆధునిక యంత్రాల అద్దె వ్యవహారాలను మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఇతర కార్యకలాపాల మాదిరిగానే అద్దె యంత్రాల నిర్వహణ బాధ్యతను కూడా సెర్ప్ అధికారులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అయితే వారు రోజువారీ కార్యకలాపాలు, ప్రభుత్వ విధులు, సమావేశాలతో నిత్యం బిజీగా ఉంటూ అద్దె యంత్రాలను కార్యాలయాలకే పరిమితం చేశారు. ప్రారంభంలో మండల కేంద్రాల్లోని ఒకరిద్దరు రైతులు ఆసక్తితో వాటిని వినియోగించేందుకు ప్రయత్నించినా ప్రతి రోజు ఉదయం తీసుకెళ్లి, తిరిగి సాయంత్రం అప్పగించాలన్న నిబంధన వారికి ఇబ్బందిగా మారింది. అద్దె కంటే రవాణా ఖర్చులే అధికం కావడంతో వారు వినియోగాన్నే మానేశారు. ఇలా సెర్ప్ అధికారుల ఆంక్షలతో రైతులు అద్దె యంత్రాలకు దూరమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి.

నిరుపయోగంగా యంత్రాలు..

భారీ వ్యయంతో కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. అత్యధిక మండలాల్లో వీటిని కొనుగోలు చేసి ఏడాది గడుస్తున్నా నేటికీ ఒక్క రైతు కూడా వినియోగించకపోవడం గమనార్హం. ఈ పథకం చాలా మండలాల్లో నష్టాల్లోనే నడుస్తోందని ఉన్నతాధికారులే చెబుతున్నారు. రూ.లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా మారడంతో మహిళా సమాఖ్యల నిధులకు కనీసం వడ్డీ కూడా రాకపోగా, బ్యాంక్ రుణానికి మాత్రం వడ్డీ భారం పెరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దె యంత్రాల వినియోగంపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని మహిళా సమాఖ్యలు కోరుతున్నాయి.

సంఘాలకు అప్పగిస్తేనే..

మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో ఉన్న ఆధునిక యంత్రాల విషయమై పెద్దగా ప్రచారం కనిపించడం లేదు. గ్రామాల్లో భారీ యంత్రాలను అందుబాటులో ఉంచితే రైతులు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. అద్దె యంత్రాల నిర్వహణలో మండల, గ్రామ సమాఖ్యలను భాగస్వాములను చేస్తే సత్ఫలితాలు ఉంటాయని పలువురు మహిళలు అంటున్నారు. కనీసం సమాఖ్య సభ్యులు వినియోగించుకున్నా ఆశించిన మేర ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు.

రైతులు వినియోగించుకోవాలి

అన్ని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళా సమాఖ్యలను భాగస్వామ్యం చేయడంతోపాటు విస్తృతంగా ప్రచారం చేసి రైతులకు, మండల సమాఖ్యలకు మేలు జరిగేలా కృషి చేస్తాం.
– సునంద, సెర్ప్ డీపీఎం

అమరుల త్యాగం మరువలేనిది

కలెక్టర్ జితేష్ వి పాటిల్



పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

కొత్తగూడెంరూరల్: శాంతియుత సమాజమే పోలీసుల లక్ష్యమని, విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట కలెక్టర్ పరేడ్ కమాండర్ లాల్ బాబు ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతి భద్రతలను పరిరక్షించే క్రమంలో సంఘ విద్రోహశక్తులతో పోరాడి అమరత్వం పొందిన పోలీసులు, వారి త్యాగం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజల సంరక్షణ కోసం పోలీసు వ్యవస్థ నిరంతరం పనిచేస్తోందని, శాంతిభద్రతల పరిరణక్షతోపాటు దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో పోలీసులు కీలకంగా పని చేస్తారని కొనియాడారు. సమాజంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే స్పందించి ప్రజలకు సేవలు అందించడంలో ముందుటారని అభినందించారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా పోలీసులు ప్రజల రక్షణ కోసం పని చేస్తున్నారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సంఘ విద్రోహ శక్తులతో పోరాడి వీర మరణం పొందిన వారి త్యాగం మరువలేనిదని నివాళులర్పించారు. పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31 జాతీయ ఐక్యతా దినోత్సవం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయి మనోహర్, డీఎస్పీలు చంద్రభాను, రెహమాన్, మల్లయ్య స్వామి, రవీందర్‌రెడ్డి, సతీష్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ ఉన్నారు.

పంటలు ముంపునకు గురికాకుండా చూడండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



పంటల పరిశీలనకు కాలినడకన వెళ్తున్న కలెక్టర్ పాటిల్, అధికారులు

పాల్వంచరూరల్ : పంటలు వరద ముంపునకు గురికాకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, లోతువాగుపై గాబియన్ చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పాండురంగాపురం శివారులో కిన్నెరసాని – లోతువాగు కలిసే ప్రాంతంలో వరదలకు పంటలు ముంపునకు గురవుతున్నాయని, ఇసుకమేటలు పెడుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని రైతులు ఇటీవల ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. దీంతో స్పందించిన కలెక్టర్ సోమవారం రైతులతో కలిసి ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలంలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు ఒకవైపు, లోతువాగు పొంగినప్పుడు మరోవైపు పొలాలు వరద ముంపునకు, భూములు కోతకు గురవుతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. లోతువాగు, కిన్నెరసాని వాగులో కలుస్తున్న ప్రాంతంలో భూముల్లో ఇసుకమేటలు వేస్తున్నాయని, దీంతో ఆ భూములు సాగుకు యోగ్యంగా ఉండడం లేదని చెప్పారు. దీనికి స్పందించిన కలెక్టర్.. జలవనరుల, ఉపాధి హామీ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. రెండువాగుల వరదతో భవిష్యత్‌లో పంటలు ముంపునకు గురికాకుండా గాబియన్ చెక్ డ్యామ్ నిర్మించాలన్నారు.

ఐదు కిలోమీటర్లు కాలినడకన..

వరద ముంపునకు గురైన పంటలను పరిశీలించేందుకు కలెక్టర్ పాటిల్ రహదారి సక్రమంగా లేని మార్గంలో ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లారు. పాండురంగాపురం శివారులోని కృష్ణసాగర్ వైపు వెళ్లే రోడ్డు మార్గంలో వాహనంలో వెళ్లి అక్కడి నుంచి రైతులతో కలిసి కాలినడకన వెళ్లి రైతుల సమస్యలను సావధానంగా విన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, జలవనరుల శాఖ ఈఈ బి.అర్జున్, డీఈ రాణి, డాక్టర్ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి, రైతులు గంగిరెడ్డి లింగారెడ్డి, సురేందర్‌రెడ్డి, రూప్లానాయక్, రమేష్, బోడప్ప తదితరులు ఉన్నారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సునిశితంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై వినతులు సమర్పించగా, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిష్కారానికి అర్హత లేకుంటే ఆ విషయాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- లక్ష్మీదేవిపల్లి మండలం హర్యాతండాకు చెందిన జాటోత్ సామ సర్వే నంబర్ 123లోని తన సొంత స్థలంలో ఇల్లు నిర్మిస్తుండగా అదే గ్రామానికి చెందిన మీరా రాజా, అజ్మీరా రవి.. ఆ స్థలంపై నకిలీ దస్తావేజులు సృష్టించి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని వినతిపత్రం ఇవ్వగా లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- తాను బీఎస్సీ నర్సింగ్ చేశానని, కులాంతర వివాహం చేసుకుని, మనస్పర్థలతో భర్త నుండి విడిపోయి ఒంటరిగా జీవిస్తున్నానని, ఇద్దరి పిల్లల పోషణ కష్టంగా మారిందని, వైద్యశాఖలో ఉపాధి కల్పించాలని ఇల్లెందు మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన చీమల లావణ్య చేసిన దరఖాస్తును డీఎంహెచ్‌ఓకు ఎండార్స్ చేశారు.
- మెడికల్ కళాశాలలో అక్రమ పద్ధతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ పాటించకుండా, జిల్లా సెలక్షన్ కమిటీ అప్రూవల్ లేకుండా మొదటి విడత 32 పోస్టులు, రెండో విడత 73 పోస్టులు భర్తీ చేశారని, వాటిని రద్దుచేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్, నాయకులు హరి మారయ్య చేసిన దరఖాస్తును సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెం బస్టాండ్ ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సాయి, నాయకులు శంకర్, మురళి అందజేసిన దరఖాస్తును మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.

ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలి



ఆశ వర్కర్‌కు పుస్తకం అందిస్తున్న భాస్కర్ నాయక్

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని ఆశ కార్యకర్తలు ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ అన్నారు. సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 1,411 మంది ఆశ వర్కర్లకు వివరాలు నమోదు చేసే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆశా కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వహిస్తే, ఆరోగ్య కార్యక్రమాలు నూరు శాతం అమలవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, ఏఓ బాలాజీ, డాక్టర్ మధువన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ రాహుల్

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వాటిని యూనిట్ అధికారులకు అందచేసి అర్హతల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇప్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా శ్రద్ధ వహించాలని తెలిపారు.

గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఏన్కూర్ మండలం రేపల్లెవాడకు చెందిన భూక్యా శ్రీవిద్య వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదివిన ఆమెకు ఐటీడీఏ తరఫున రూ.50వేల చెక్కును పీఓ రాహుల్ అందచేశారు. అలాగే, ఎంబీఏలో సీటు సాధించిన దుమ్ముగూడెం మండలం కొత్తమారేడుకు బుద్దుల కవితకు రూ.30 వేలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అధికారి మణెమ్మ, వివిధ శాఖల అధికారులు తానాజీ, రాంబాబు, భాస్కరన్, రవీంద్రనాథ్, ఉదయ్‌కుమార్, వేణు, మనిధర్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, హరికృష్ణ, శ్రీనివాసరావు, లింగానాయక్, జయరాజ్, నరేందర్ పాల్గొన్నారు.

మహిళల శ్రమను దోచుకుంటున్నారు..

- పెట్టుబడిదారీ విధానంపై పోరాడాలి
- సింగరేణిలో 49శాతం వాటా ప్రైవేట్ పరానికి కేంద్రం కుట్ర
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు (ఇన్‌సెట్) మణుగూరులో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బృందాకారత్

సింగరేణి(కొత్తగూడెం): మహిళల శ్రమను దోపిడీ చేస్తున్న మనువాదం, పెట్టుబడిదారీ విధానంపై ఉద్యమించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు, ఐద్వా సీనియర్ నాయకురాలు బృందాకారత్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం త్రిశూల్ విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. వాటిలో ఒకటి పెట్టుబడిదారీ కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు, రెండోది మతోన్మాద భావజాలం, మూడోది మహిళలను తిరోగమన భావజాలం వైపు నడిపించే మనువాద సిద్ధాంతమని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో 49 శాతం వాటాను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, తద్వారా వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి ఉపరితల గనుల కోసం గిరిజనులు, దళితుల నుంచి పెద్ద ఎత్తున భూసేకరణ చేస్తున్నారని, దీనికి సరైన పరిహారం అందించడం లేదని విమర్శించారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు ఈ దేశ పౌరులు కాదా అని ఆమె ప్రశ్నించారు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారిలో 95 శాతం మంది మహిళలేనని, వారికి రోజుకు రూ. 250 చెల్లించి క్వింటాళ్ల కొద్దీ మట్టి మోయిస్తున్నారని అన్నారు. గతంలో ఉల్లిగడ్డలు కోస్తే కన్నీళ్లు వచ్చేవని, బీజేపీ హయాంలో కొనాలంటేనే నీళ్లు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ధరల పెరుగుదల, ఆహార భద్రత ప్రధాన సమస్యగా మారాయని, దీనిపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మహిళలు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్నారని, గత ప్రభుత్వం వారిని మోసం చేసిందని విమర్శించారు. స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయడం లేదని, ఇళ్లు లేనివారికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పట్టణంలో భారీ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, కోశాధికారి ఎస్. పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధా సుందర రామన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, బుగ్గవీటి సరళ, డి.సీతాలక్ష్మి, ఎం. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ పేరిట విధ్వంసం సరికాదు

మణుగూరు రూరల్: సింగరేణి గనుల విస్తరణ పేరుతో అటవీ ప్రాంతాలు, భూములను విధ్వంసానికి గురి చేయడం సరికాదని బృందా కారత్ అన్నారు. మణుగూరు ఏరియాలోని ఓసీ–2 ప్రాంతంలో సోమవారం పర్యటించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కాంట్రాక్ట్ కార్మికులు, కొత్తకొండాపురం గిరిజనులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 1991 తర్వాత ప్రైవేటీకరణలో వేగం పెరిగిందన్నారు. భూములు కోల్పోయి పేద కుటుంబాలు రోడ్డున పడగా, ఆదివాసీ చట్టాలను అమలు చేయకపోవడంతో గిరిజనులకు నష్టం జరుగుతోందని తెలిపారు. పరిహారం విషయంలో నిర్వాసితులకు సింగరేణి సరైన న్యాయం చేయడం లేదని విమర్శించారు. సింగరేణి, బీటీపీఎస్‌ల్లో నిర్వాసిత, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు రమాదేవి, మంద నరసింహారావు, నెల్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రచయిత్రి లలితకు అవార్డు

భద్రాచలంఅర్బన్: సాహితి, కళారంగాలలో విశిష్ట కృషి చేస్తున్న భద్రాచలం పట్టణానికి చెందిన రచయిత్రి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలితకు పురస్కారం లభించింది. తాడేపల్లిగూడెంలోని ప్రసిద్ధ సాహితీ సంస్థ, బీవీఆర్ కళాకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కళాసేవా పురస్కారం అవార్డు అందించారు. రాష్ట్రస్థాయి అవార్డు, మెమెంటో, ప్రశంసా పత్రాలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

మణుగూరు టౌన్/పాల్వంచరూరల్: హైదరాబాద్‌లోని బేగంపేటలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ మెమరీ చాంపియన్‌షిప్–2024లో మణుగూరు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏడుగురు విద్యార్థులు చాంపియన్‌షిప్‌లో పాల్గొనగా, నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ఆరు పతకాలు సాధించారు. పది విభాగాల్లో మూడు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన పప్పుల చక్రి మూడు పతకాలు, గుగులోత్ అఖిల్ తేజ్, గంగిశెట్టి దిశాలిని, తారల శ్రీనిధి ఒక్కో పతకం చొప్పున సాధించారు. కాగా ఏజెన్సీ మారుమూల గ్రామం నుంచి జాతీయ స్థాయి మెమరీ చాంపియన్ షిప్‌లో ప్రతిభ చూపడం పట్ల చిన్నారులను సోమవారం పలువురు అభినందించారు. కాగా వీరిలో అఖిల్ తేజ్ జాతీయ స్థాయిలో 8వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించినట్లు పాల్వంచ మండలం కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్లో హిందీ పండిట్లుగా పనిచేస్తున్న అతని తల్లిదండ్రులు వీరన్న, మంజుల తెలిపారు.

రేపు బహిరంగ వేలం పాట

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన కొత్త కాంప్లెక్స్‌లో ఉన్న 4వ నంబర్ దుకాణానికి ఈ నెల 23న వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం వద్ద పోగుచేసిన చీరల అమ్మకం, శివాలయం ఎదుట మూడు షెటర్ల తొలగింపు, పాతకాంప్లెక్స్‌లోని ఒకటో నంబర్ షాపులోని బల్లాలు, బొమ్మలు, ఇతర వస్తువుల అమ్మకానికి కూడా టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలను నిర్వహించనున్నట్లు వివరించారు.

24న కానుకల లెక్కింపు

పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి మొక్కుబడిగా సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ఈనెల 24వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి మరో ప్రకటనలో తెలిపారు.

గోదావరి స్నాన ఘట్టాల పరిశీలన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి ఘాట్ వద్ద గడిచిన నాలుగు రోజులుగా భక్తులు స్నానం చేస్తూ గల్లంతవుతుండగా గజ ఈతగాళ్లు, స్థానికులు రక్షిస్తున్నారు. ఈ ఘటనలపై 'హెచ్చరిక బోర్డులేక్కడ' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. భద్రాచలం ఇరిగేషన్ శాఖ జేఈఈ వెంకటేశ్ సిబ్బందితో కలిసి గోదావరి స్నాన ఘట్టాలను సందర్శించారు. తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. నిత్యం నలుగురు గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా, మోటార్‌బోటు, గోదావరి నదిలో ఇనుప కంచెను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌ను కలిసి ఇదే విషయాన్ని వివరించనున్నారు.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలం అర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద సోమవారం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 4.50 కేజీల గంజాయిని పట్టుకుని సీజ్ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, ఇల్లెందుకు చెందిన మనోజ్, అజారుద్దీన్‌లను అరెస్ట్ చేసి, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ తెలిపారు.

బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు

ఇల్లెందు: రైతుబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు ఆదివారం ఇల్లెందులో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాగా పబ్లిక్ న్యూసెన్స్ చేయడంతో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, దిండిగాల రాజేందర్‌ల తోపాటు 21 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలపై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

ముదురుతున్న ఏఈఓల వివాదం

- డిజిటల్ క్రాప్ సర్వేకు నిరాకరిస్తున్న ఏఈఓలు
- కాంట్రాక్ట్ సిబ్బంది జోలికి వస్తే సహించేదిలేదని ప్రకటన
- అవసరమైతే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సమాయత్తం
- సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు


జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఈఓలు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో వ్యవసాయ శాఖకు, వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈఓ)లకు మధ్య వివాదం ముదురుతోంది. సర్వే నిర్వహించేందుకు జిల్లాలో అవసరమైన సంఖ్యలో ఏఈఓలు లేరని, ఇతర రాష్ట్రాల మాదిరిగా కాంట్రాక్ట్ పద్ధతిలో మరికొందరిని నియమిస్తే సర్వే నిర్వహిస్తామని ఏఈఓల సంఘం పేర్కొంటోంది. ఈ క్రమంలో సర్వేను నిరాకరిస్తున్న కాంట్రాక్ట్ ఏఈఓలపై వేటుకు సిద్ధమని ప్రభుత్వం పరోక్ష ప్రకటనలు చేస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ, ఏఈఓల మధ్య వివాదం ముదురుతోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఏఈఓల ప్రతినిధులతో సమావేశం జరిపి, జేఏసీ అడ్‌హాక్ కమిటీని కూడా ఏర్పాటు చేసుకున్నారు. తమ సమస్యలపై చర్చించుకున్నారు.

తాత్కాలిక పద్ధతిలో నియమించాలి

జిల్లాల్లో ఉన్న సాగుభూమికి అనుగుణంగా ఇతర రాష్ట్రాల మాదిరిగా కాంట్రాక్టు ఏఈఓలను, గ్రామ సహాయకులను నియమించాలని ఏఈఓల సంఘం కోరుతోంది. ఇప్పటికే విధి నిర్వహణలో సతమతమవుతున్న తమకు శాఖా పరంగానే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో కూడా విధులు కేటాయించడంతో తలకు మించిన భారంగా మారిందని ఏఈఓలు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాలలో శిక్షణ ఇచ్చి కాంట్రాక్టు పద్ధతిలో అదనపు సిబ్బందిని నియమిస్తుంటే తెలంగాణలో మాత్రం ఎందుకు నియమించడంలేదని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర 11 రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో ప్రతి 1000 ఎకరాలకు ఒకరిని అదనంగా నియమించారని పేర్కొంటున్నారు. లోకల్ యూత్, కృషి పేర్లతో తాత్కాలిక పద్ధతిలో నిరుద్యోగ యువతను ఎంపిక చేసి సర్వే చేపడుతున్నారని చెబుతున్నారు.

పెరుగుతున్న పనిభారం

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల సాగు భూమి సర్వేకు 15 వేల మంది అదనపు సిబ్బంది అవసరమవుతారని ఏఈఓల సంఘం పేర్కొంటోంది. ప్రస్తుతం 2,600 మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో 8 నుంచి 10 మంది చేయాల్సిన పనులను కేవలం ఒక్కరితోనే చేయించాలనే నిర్ణయం మానసిక, శారీరక ఇబ్బందులను తీసుకువస్తోందని ఏఈఓలు వాపోతున్నారు. కానీ ఉన్న ఏఈఓలే సర్వే చేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా స్పష్టం చేస్తోంది.

సిబ్బంది కొరత

రాష్ట్రంలో 2606 క్లస్టర్లు ఉండగా ప్రస్తుతం 2300 మంది మాత్రమే రెగ్యులర్ ఏఈఓలు పనిచేస్తున్నారు. మిగతా క్లస్టర్లలో కాంట్రాక్టు పద్ధతిలో నెలకు రూ 15,000 గౌరవ వేతనంతో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 67 క్లస్టర్లు ఉండగా వీరిలో 58 మంది రెగ్యులర్ ఏఈఓలు, 9 మంది కాంట్రాక్టు ఏఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. డిజిటల్ సర్వే నిర్వహించకపోతే విధుల నుంచి తొలగిస్తామమని కాంట్రాక్ట్ ఏఈఓలకు హెచ్చరికలు ప్రారంభమయ్యాయి. దీంతో గత నెల చివరలో ఏఈఓలు జేఏసీగా ఏర్పడి పనిభారం తగ్గించాలని, అదనంగా సిబ్బందిని నియమించాలని, కాంట్రాక్టు ఏఈఓలపై వేధింపులు ఆపాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గత గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వ్యవసాయాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

సమ్మెకైనా సిద్ధం

ఏఈఓల సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకైనా సిద్ధం. ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్నాం. దీనికితోడు డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని ఒత్తిడి చేయడం సరికాదు. అదనపు సిబ్బందిని నియమించాలి.

–బందెల నరసింహారావు, ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆపన్నహస్తం అందించండి..

- పెద్ద పేగు కేన్సర్‌తో బాధపడుతున్న హిజ్రా
- దాతలు సాయం చేయాలని వేడుకోలు..

దీనగాథ

కొత్తగూడెంటౌన్: ఆడపిల్ల వేషధారణ అంటే ఇష్టంతో టింకు కాస్త హిజ్రా సమంతగా మారింది. ఒంటరిగా తమ్ముడితో కలిసి జీవిస్తోంది. అయితే, సమంతకు కేన్సర్ అని వైద్య పరీక్షల్లో తేలింది. ప్రస్తుతం వైద్య ఖర్చుల కోసం దాతలు సహాయం చేయాలని కోరుతోంది. రామవరం నాగయ్యగడ్డ సాధన గ్రౌండ్ సమీపంలో ఒక అద్దె ఇంట్లో హిజ్రా ఓరుగంటి సమంత ఉంటోంది. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన సమంత చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో 18ఏళ్ల కిందట తనకు 10ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు రామవరం వచ్చింది. తనకు టిల్లు అనే మూగ చెవిటి తమ్ముడు ఉన్నాడు. ప్రతిరోజూ తోటి హిజ్రా లతో కలిసి వెళ్లి వచ్చిన డబ్బులతో జీవిస్తోంది. ఆరు నెలలుగా అనారోగ్యంగా ఉండటంతో కొత్తగూడెం, హైదరాబాద్‌లలోని ఆస్పత్రుల్లో అనేక రకాల టెస్టు లు చేయగా.. 10 రోజుల కిందట కేన్సర్ అని తెలిసింది. ఆరు నెలలుగా తోటి హిజ్రాలు తినడానికి, మందులు, చికిత్సకు సాయం చేశారని, తినడానికి కష్టమవుతున్న తనకు కేన్సర్ చికిత్సకు డబ్బులు లేవని.. ఎవరైనా దాతలు సహాయం చేయాలని కన్నీటి పర్యంతమైంది.

దాతలు ఆదుకోండి..

– ఓరుగంటి సమంత



నా పెద్దపేగుకు కేన్సర్ సోకిందని డాక్టర్లు తెలిపారు. రోజూ మందులు వాడాలని, కీమో థెరపీ, రేడియేషన్ చేయించుకోవాలని డాక్టర్లు తెలిపారు. ఆరు నెలల పాటు వైద్యం చేయించుకోవాలి. నాకు అంత స్థోమత లేదు. దాతలు ఎవరైనా సహాయం చేయాలని వేడుకుంటున్నాను. సమంత ఓరుగంటి సెల్ నంబర్ 88978 93617కు సాయం చేయండి.

ఆదివాసీ, గిరిజన మహిళలకు చీరలు


మహిళలకు చీరలు అందజేస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఆదివాసీ, గిరిజన మహిళలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులైన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన చీరలు పంపిణీ చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రత్యేక అధికారి రమణయ్యతో కలిసి చీరల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. పద్నాలుగు మండలాల్లోని ఐకేపీ ఏపీఎం, సీసీలు, ప్రత్యేక అధికారుల సమక్షాన పారదర్శకంగా చీరలు పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. భద్రాచలంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు 7,220 మందికి చీరలు అందజేయగా, ఇంకా 5,190 మంది ఉన్నారని పేర్కొన్నారు. భద్రాచలం ఐకేపీ ఏపీఎం జగదీష్, సీసీలు సీతారాములు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా

నోటీసులను సైతం ఖాతరు చేయని టీడీపీ నేత


ప్రభుత్వ స్థలంలో టీడీపీ నేత చేపట్టిన నిర్మాణం

అశ్వారావుపేటరూరల్: ఓ గ్రామస్థాయి టీడీపీ నేత రూ.లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా కబ్జా చేయడమే కాక పట్టపగలే నిర్మాణ పనులు చేపడుతున్నాడు. అయినప్పటికీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. అశ్వారావుపేట మండలంలోని వినాయకపురంలో ప్రధాన రహదారి సమీపాన ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. అక్కడ కొన్నేళ్ల క్రితం గ్రామ అవసరాలకు సంబంధించి మినీ వాటర్ ట్యాంక్ ఉండగా అది శిథిలం కావడంతో తొలగించారు. ఆనాటి నుంచి స్థలం ఖాళీగా ఉండడం, వినాయకపురంలో సెంట్ స్థలం విలువ దాదాపు రూ.3లక్షలు పలుకుతుండడం మరో గ్రామం నుంచి వలస వచ్చిన టీడీపీ నాయకుడి కన్నుబడింది. ఈమేరకు ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి మూడు రోజుల క్రితం శుభ్రం చేయించిన ఆయన సిమెంట్ ఇటుకలతో పునాది వరకు నిర్మించాడు. ఈ విషయాన్ని స్థానికులు గ్రామపంచాయతీ కార్యదర్శి సాయి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నోటీసు జారీ చేసిన పనులు ఆపలేదు. అంతేకాక అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వెళ్తే కాంగ్రెస్ నాయకులు, ఓ ఎమ్మెల్యే పేరు చెప్పి వెనక్కి పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈమేరకు అధికార పార్టీ నేతల అండతో ప్రభుత్వం స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తేలగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే గ్రామంలోని శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపాన ఆర్‌అండ్‌బీ పాత రహదారి స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు నిర్మించాడని చెబుతున్నారు. ఈ అంశంపై గ్రామ కార్యదర్శి సాయిని వివరణ కోరగా అక్రమంగా నిర్మాణం చేపట్టిన స్థలం గ్రామపంచాయతీతోపాటు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండగా నిర్మాణదారుడికి నోటీసులు ఇచ్చి ఎంపీఓ, ఆర్‌అండ్‌బీ ఏఈఈ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసి కోయగూడెం ఓసీ–2 భూనిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ టేకులపల్లి మండలం లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండా, కొత్తతండా, జేత్యతండా గ్రామాలకు చెందిన 105 గిరిజన కుటుంబాలు సాగుభూములు కోల్పోయారని అన్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. 2011, 2024 సంవత్సరాల్లో రెండుసార్లు హైకోర్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. వెంటనే అధికారులు గిరిజన నిర్వాసితులకు భూమి నష్టపరిహారం, ఉద్యోగాలు, భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, దొడ్డ సంపత్‌కుమార్, కోటేశ్వరరావు, బోడ కృష్ణ, బానోత్ కృష్ణ, ఈసం చుక్కమ్మ, భట్టు సత్తెమ్మ, చీమల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లిపాక పోస్టాఫీస్‌లో స్వాహాపర్వం

అధికారుల విచారణ, పోస్టుమాస్టర్ సస్పెన్షన్


నెల్లిపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న ఖాతాదారులు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకబంజర పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్ ఖాతాదారుల సొమ్ము స్వాహా చేశాడు. తమ అవసరాలకు డబ్బు డ్రా చేయాలని పోస్టుమాస్టర్‌ను అడుగుతుండగా వాయిదాలు వేస్తున్నారు. దీంతో అనుమానం వచ్చి ఖాతాదారులు సారపాక ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా ఖాతాల్లో నగదు లేదని తేలింది. పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన నగదును ఖాతాల్లో జమ చేయకుండా జమ చేసినట్లు పుస్తకాలలో రాసి స్టాంప్ వేసి ఇచ్చాడు. నగదును సారపాక ప్రధాన కార్యాలయంలో జమ చేయకుండా స్వాహా చేశాడు. సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు స్వాహా చేసినట్లు సమాచారం. దీంతో ఖాతాదారులు సోమవారం నెల్లిపాకబంజరలోని పోస్టాఫీస్‌కు చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేయగా తపాలాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి స్వాహా సొమ్మును రికవరీ చేసి, తమకు అప్పగించాలని ఖాతాదారులు కోరుతున్నారు. ఐపీఓ రామ్మూర్తిని వివరణ కోరగా.. నిధుల అవకతవకలపై విచారిస్తున్నామని, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. బాధ్యుడైన పోస్టుమాస్టర్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందురూరల్: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని రాఘబోయిన గూడెం గ్రామ పంచాయతీకి చెందిన కల్తి శ్రావణి అనే గిరిజన మహిళ అదే గ్రామపంచాయతీకి చెందిన బీసీ యువకుడు ప్రభాకర్‌ను వివాహం చేసుకుంది. కొంతకాలంగా భర్త వేధింపులకు గురిచేస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రభాకర్‌పై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్య తెలిపారు.

నేటి నుంచి బొగ్గు టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్ల సమ్మె


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

టేకులపల్లి: ఏడేళ్లుగా వేతనాలు పెరగకపోవడంతో మంగళవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్లు టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్టు బొగ్గు టిప్పర్ల డ్రైవర్లు, క్లీనర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం దాసుతండాలోని అడ్డా వద్ద జరిగిన సమావేశంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షా వలీ, మోటార్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న మాట్లాడారు. ఓసీ నుంచి బొగ్గు రవాణా చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని పది నెలల క్రితమే సమ్మె నోటీస్ ఇవ్వగా, వాయిదా పడుతూ వచ్చిందన్నారు. అయితే, సోమవారం మధ్యాహ్నం చర్చలకు ఆహ్వానించిన యాజమానులు ఆతర్వాత వాయిదా వేయడంతోసమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మధార్, చింటు, రాజేష్, చంటి, వీరభద్రం, రమేష్, బాబు, నర్సింహారావు, రాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

14 మంది చిన్నారులు శిశుగృహకు తరలింపు


పిల్లలను అప్పగించాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు

భద్రాచలంఅర్బన్: అధికారులు సోమవారం 14 మంది చిన్నారులను శిశుగృహకు తరలించారు. ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ భద్రాచలంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న శిశుగృహను సందర్శించారు. జిల్లాలో ఎక్కడైనా చిన్నారులను ఎత్తుకుని భిక్షాటన చేస్తే ఆ చిన్నారులను రక్షించి శిశుగృహకు చేర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం భద్రాచలం పట్టణంలోని కొర్రాజులగుట్టకు చెందిన 14 మంది చిన్నారులను పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న శిశుగృహకు తరలించారు. అనంతరం ఏడేళ్ల వయసు పైబడి ఉన్న ఐదుగురిని మణుగూరు, కొత్తగూడెం తీసుకెళ్లారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం హరికుమారి, 20 మంది సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి చిన్నారులను శిశుగృహకు తీసుకొచ్చారు. కాగా తల్లిదండ్రులు శిశుగృహకు చేరుకుని మరోమారు చిన్నారులను ఎత్తుకుని భిక్షాటన చేయబోమని, తమ పిల్లలను తమకు అప్పగించాలని వేడుకుంటున్నారు.

కోటమైసమ్మ జాతర ఆదాయం రూ.27.17లక్షలు

కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయపల్లిలో దసరా సందర్భంగా నిర్వహించిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతరలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కతేలింది. ఈనెల 12నుంచి 16వ తేదీ వరకు రూ.7.03లక్షలు ఆదాయం నమోదు కాగా, 20వ తేదీ వరకు వచ్చిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈమేరకు నాలుగు రోజుల్లో రూ.30,543 ఆదాయం రాగా హుండీ ఆదాయం రూ.7,33,549గా నమోదైందని, ఇది గత ఏడాదితో పోలిస్తే రూ.31,930 అధికమని ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పట్టాభిరామారావు తెలిపారు. ఇక హుండీ ఆదాయంతో పాటు కొబ్బరికాయలు, పూజాసామగ్రి, ప్రసాదాల అమ్మకం, దుకాణాల ఏర్పాటుకు వేలం ద్వారా గత ఏడాది రూ.26,26,737 వస్తే ఈసారి రూ.27,17,949గా నమోదైందని వెల్లడించారు. తద్వారా గతేడాదితో పోలిస్తే ఆదాయం రూ.91,212 పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాశ్‌శర్మ, ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

ఖమ్మంక్రైం: పోలీస్ కానిస్టేబుల్ కుటుంబం తమ చిన్నారి పుట్టువెంట్రుకలు తీసేందుకు ఏపీలోని అన్నవరం వెళ్లొచ్చేసరికి ఇంట్లోకి చొరబడిన దొంగలు బంగారం, నగదు అపహరించారు. ఈ ఘటన వివరాలు... భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హిమతేజ్ కుటుంబం ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఆర్‌డబ్ల్యూస్ కార్యాలయం ఎదురుగా నివసిస్తోంది. ఆయన ఇంట్లో చిన్నారి పుట్టువెంట్రుకలు తీసేందుకు అన్నవరం వెళ్తుండగా సోదరి జయసుధ, బంధువులు ఖమ్మం రావడంతో, సోదరి బంగారు ఆభరణాలు ఇక్కడే పెట్టి శనివారం రాత్రి వెళ్లారు. తిరిగి ఆదివారం అర్ధరాత్రి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపల పరిశీలించడంతో బీరువా తెరిచి ఉండడం, అందులోని 16తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు లేకపోవడంతో ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ బాలకృష్ణ, సీసీఎస్ సీఐ రాజు, క్లూస్‌టీమ్ సిబ్బంది చేరుకుని ఆధారాలు సేకరించడమేకాక సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాగా, చోరీ అయిన సొత్తు విలువ రూ.10లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు.

లొంగిపోయిన మావోయిస్టు పీఎల్‌జీఏ సభ్యుడు

చర్ల: మావోయిస్టు మోస్ట్ వాంటెండ్ హిడ్మా బెటాలియన్ నంబర్–1లో పనిచేస్తున్న క్రియాశీలక సభ్యుడు, మైనర్ మావోయిస్టు సోమవారం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పోలీసుల ముందు లొంగిపోయాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధి సిలిగేరు గ్రామానికి చెందిన 16 యేళ్ల ముఖేష్ కొర్సా 2023లో మావోయిస్టు ఉద్యమానికి ప్రభావితుడై పార్టీలో చేరాడు. అప్పటి నుంచి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఉన్న పీఎల్‌జీఏ ఒకటో నంబర్ బెటాలియన్‌లో కంపెనీ–3కి బాధ్యత వహిస్తున్న హిడ్మా నేతృత్వంలో చురుకుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇతనిపై ఐదు కేసులు నమోదయ్యాయి. కాగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోయిన మావోయిస్టుల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై పోలీసుల వద్ద లొంగిపోయాడు. అతనిపై ఉన్న రూ.2 లక్షల రివార్డు ఇప్పించేందుకు కృషి చేస్తామని పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెంలో కోడిపందేల స్థావరంపై ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, నాలుగు కోళ్లు, రెండు బైక్‌లు, రూ.6,950 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల పంచాయతీ ముసలిమడుగు గ్రామానికి చెందిన వాగే సత్యంకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడిఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంటితోపాటు సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. ఇంట్లో దాచిన రూ.55 వేల నగదు, పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా కాలిపోయాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు


తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు వర్ష

పాల్వంచ: అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రి మృతి చెందడంతో కూతురు తలకొరివి పెట్టింది. స్థానికుల కథనం ప్రకారం... పట్టణంలోని కేఎస్‌ఎం వద్ద దాబా నడిపే లకావత్ రాంబాబు(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రూ.లక్షలు వెచ్చించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఇంకా చికిత్స అందించలేక కుటుంబం కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురైంది. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతునికి ముగ్గురు కూతుర్లు ఉండగా, పెద్ద కూతురు వర్ష తలకొరివి పెట్టింది. కాగా భార్య సునీత, కూతుర్లు విలపిస్తున్న తీరు కలిచివేసింది.